



ఆకర్షిస్తున్న మట్టి వినాయకుడు

కరప మండలం వేళంగి మార్కెట్‌సెంటర్‌లో కొలువుదీరిన 11.5 అడుగుల మట్టి వినాయకుడు

డిప్యూటీ సీఎం సారూ.. సమస్య పరిష్కరించండి



గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు 216వ జాతీయ రహదారిపై బి.ప్రత్తిపాడు జంక్షన్ మృత్యుకుహరంగా మారిందని, ప్రమాదాల నియంత్రణకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రజాప్రతినిధులు, బి.ప్రత్తిపాడు గ్రామస్తులు డిమాండ్‌చేస్తూ ఇలా రాస్తారోకో చేపట్టారు..

తొలిరోజు జిల్లాలో 4,873 స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

- నేడు కరప, పెదపూడి మండలాల్లో..
- రేపు పిఠాపురం నియోజకవర్గంలో పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. జిల్లాలో 6,36,238 స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా తొలి రోజు సోమవారం 4873కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేల సమక్షంలో ఆయా నియోజకవర్గాల్లో రేషన్‌కార్డులు పంపిణీ ప్రారంభించారు. కొత్తస్మార్ట్‌కార్డులు ఈ-పోస్ మిషన్ ద్వారా రేషన్ కార్డుదారుడి వేలు ముద్ర తీసుకుని ఆన్‌లైన్ పద్ధతిలో జారీ చేస్తున్నారు. రేషన్‌డీలర్లు కొత్తకార్డులు జారీ చేయడంతోపాటు రేషన్ పంపిణీ చేయడంవల్ల కొంత సమయం తీసుకుంటోంది. జిల్లాలో సోమవారం చాలా మండలాల్లో పంపిణీజరిగింది. కొన్ని కారణాలవల్ల కరప, పెదపూడి, పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు అర్బన్, గొల్లప్రోలు రూరల్ మండలాల్లో వాయిదా పడింది. మంగళవారం కరప, పెదపూడి మండలాల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి సిద్ధమవుతున్నారు. బుధవారం పిఠాపురం నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘనంగా పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈవిషయమై జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజును ఆంధ్రజ్యోతి సంప్రదించగా అర్హులైన అందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నామన్నారు.

బిల్డింగ్.. బిల్డప్పే!



బోటు బిల్డింగ్ యార్డు

- కాకినాడలో అక్కరకు రాని రూ.5 కోట్ల బోట్ బిల్డింగ్ యార్డు
- అయిదేళ్ల నుంచీ ఒక్క బోటంటే ఒక్కటి కూడా నిర్మించలేని దుస్థితి
- రూ.7కోట్లతో బోటు బిల్డింగ్ యార్డును ఆధునికీకరించేసినట్లు గత వైసీపీ సర్కారు బిల్డప్
- అప్పటి ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన, జిల్లా మంత్రులు ప్రారంభోత్సవం
- ఇప్పటికీ పూర్తవని భవనాలు, లేని మౌలిక సదుపాయాలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడలో రూ.5కోట్లతో నిర్మించిన బోటు బిల్డింగ్‌యార్డు ఎందుకు కొరగాకుండా పోయింది. అయిదేళ్ల గడుస్తున్నా ఒక్క బోటంటే ఒక్కటి కూడా నిర్మాణం కాకుండా ఈసురోమంటోంది. బోట్ల తయారీకి కావాల్సిన అన్నిరకాల సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు అరకొరగా పనులు చేసి అందినకాడికి నొక్కేయడంతో దిష్టిబొమ్మలా మారింది. రూ.7కోట్లతో దీన్ని ఆధునికీకరించేశామంటూ గత వైసీపీ సర్కారు బోటు బిల్డింగ్‌యార్డు గురించి 2020లో గొప్పగా డబ్బా కొట్టుకుంది. అసలిక్కడ సదుపాయాలేవీ లేకపోయినా మత్స్యకారులు ఎంచక్కాపడవలు తయారు చేసేసుకోవచ్చంటూ అప్పటి ఇన్‌ఛార్జిమంత్రి, ఇతర జిల్లా మంత్రులు గొప్పగా కలరింగ్ ఇచ్చారు. తీరా ఇప్పటికీ ఇక్కడ పడవల తయారీకి ఏమాత్రం కనీస సదుపాయాలే లేవు. బోట్ల తయారీకి అవసరమయ్యే భవనాలు, షెడ్లు, క్రేన్లు ఇలా ఏ మౌలిక సదుపాయం కూడా లేకుండా యార్డు వెక్కిరిస్తోంది. అధికారులేమో ఇప్పటివరకు రూ.5కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతుండగా కనీసం రూ.3కోట్ల విలువైన పనులు జరిగినట్లు అసలు ఆనవాళ్లే లేవు. సిద్ధం కాని బోటు బిల్డింగ్ యార్డు సిద్ధమైనట్లు గత వైసీపీసర్కారు మత్స్యకారులను ముంచేసింది.

బిల్డింగ్ లేదు

కాకినాడ జగన్నాథపురం వంతెన సమీపంలోని ఏటిమొగ నుంచి సముద్రం వరకు వందలాది మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా తమ బోట్లలో ఉప్పుటేరు కాలువ మీదుగా సముద్రంలోకి తరచూ వేటకు వెళ్లివస్తుంటారు. ఈక్రమంలో మత్స్యకారులు ఎప్పటికప్పుడు తమ బోట్లకు మరమ్మతులు, కొత్త బోట్ల నిర్మాణం, వలలకు మరమ్మతులకు వీలుగా ఎప్పుడో పురాతన కాలంనుంచి వస్తోన్న బోటు బిల్డింగ్ యార్డును వినియోగించుకుంటున్నారు. ఇది పూర్తిగా పాతబడిపోవడంతో 1993 నుంచీ అందుబాటులో లేకుండా పోయింది. దీంతో మత్స్యకారులు బోట్ల మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం అంతా ఆరుబయటే ఉప్పుటేరు కాలువ వెంబడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడుబడిన భవనాన్ని కూలగొట్టి దాని స్థానంలో కొత్త బోటు బిల్డింగ్ యార్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు రూ.7కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనావేశారు. ఈ నిధులతో ఇక్కడ 20వర్క్‌షాపులు, ఒకేసారి 18బోట్లు నిర్మించుకునే వసతి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. ఈనిధులను కాకినాడ స్మార్ట్‌సిటీ భరించడానికి ముందుకువచ్చింది. పనులు ప్రారంభించి కొన్ని భవనాల నిర్మాణాన్ని ఏటిమొగలో 2020లో ప్రారంభించింది. తీరా ఇవేవీ పూర్తికాకుండానే గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా తన సొంత ప్రచారం కోసం బోటు బిల్డింగ్‌యార్డును వాడుకుంది. అసలు నిర్మాణాలే పూర్తికాని బోటు బిల్డింగ్‌యార్డును ఆధునికీకరించేశామంటూ ప్రచారం చేసుకుంది. అందులోభాగంగా 2020, నవంబరులో జిల్లాఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మంత్రులు పినిపే విశ్వరూప్, కన్నబాబు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి కాకినాడ ఏటిమొగకు వచ్చారు. బోటు బిల్డింగ్య యార్డును ఆధునికీకరించేశామని మత్స్యకారులు అందరూ వినియోగించుకోవచ్చని గొప్పగా డబ్బా కొట్టుకున్నారు. తీరా ఇప్పటికి అయిదేళ్లవుతున్నా బోటు బిల్డింగ్ యార్డు అసలు పూర్తి కాలేదు. అక్కడ కేవలం ఓ రెండు షెడ్లతో కూడిన భవనాలు మినహా ఏవీ లేవు. అసలేమాత్రం సదుపాయాలు లేకపోవడంతో గడచిన అయిదేళ్లలో ఇక్కడ ఒక్క బోటు కూడా నిర్మాణం జరగలేదు. కానీ గత ప్రభుత్వం తాము మొత్తం ఆధునికీకరించేశామంటూ అబద్ధాలు చెప్పి మత్స్యకారులను మోసం చేసింది. ఇప్పటికీ ఇక్కడ ఏ సౌకర్యాలు లేక అనేకమంది మత్స్య కారులు ఉప్పుటేరు కాలువ వెంబడే బోట్ల నిర్మాణం,మరమ్మతులు చేసుకోవాల్సి వస్తోంది.

పూర్తవకుండానే కట్టబెట్టేశారు

ఒకపక్క బోటు బిల్డింగ్ యార్డు నిర్మాణానికి రూ.7కోట్లుఖర్చవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు పని అప్పగించారు. సదరు కాంట్రాక్టరు ఇక్కడ రెండు షెడ్లు నిర్మించి వదిలేశాడు. వాస్తవానికి బోట్ల తయారీ, మరమ్మతు చేయాలంటే యార్డులో భారీ క్రేన్లు ఉండాలి. ఉప్పుటేరు నుంచి బోటును యార్డులోకి, యార్డులో తయారైన బోటు ఉప్పుటేరులోకి దించడానికి క్రేన్లు, ట్రాక్ ఉండాలి. కానీ ఇప్పటికీ ఇక్కడ అవేవీ లేవు. బోటు నిర్మాణానికి అయ్యే చెక్కకు సంబంధించి సామిల్లు, విడిభాగాల దుకాణాలు అందుబాటులో ఉండాలి. కానీ అవేవీ లేకపోవడంతో బోట్ల నిర్మాణానికి ఇప్పటికీ ఎవరూ రావడంలేదు. ఈ భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.20 లక్షల వరకు బిల్లులు బాకీ ఉండడంతో మిగిలిన పనులు చేయకుండా వదిలేశాడు. ఇప్పటివరకు దీని నిర్మాణానికి రూ.5కోట్లు ఖర్చుచేసినట్లు స్మార్ట్‌సిటీ అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. తీరా క్షేత్రస్థాయిలో షెడ్ల నిర్మాణానికి వెచ్చించింది రూ.3కోట్లు కూడా కనిపించడం లేదు. ఇదంతా ఒకెత్తయితే అసలింకా బోటు బిల్డింగ్ యార్డు ఒకపక్క పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. కనీస వసతులు కూడాలేవు. అయినా అధికారులు అప్పటి ప్రభుత్వ మెప్పు కోసం అడ్డదిడ్డంగా వ్యవహరించారు. బోటు బిల్డింగ్ యార్డును ఆపరేషన్, మెయింటెనెన్స్, మేనేజ్‌మెంట్(ఓఎంఎం) విధానంలో అయిదేళ్లపాటు నిర్వహించడానికి 2021, మేలో ఏకంగా టెండర్లు పిలిచేశారు. యార్డు దక్కించుకున్న సంస్థ పనితీరు బాగుంటే ఐదేళ్లతోపాటు మరో రెండేళ్ల వ్యవధి పొడిగిస్తామని టెండర్ నిబంధనల్లో ప్రస్తావించారు. యార్డులో బోట్లు తయారు చేసుకునే మత్స్యకారులకు ప్రత్యేకంగా రాయితీలు ప్రకటించారు. బోట్లు తయారు చేసుకునేందుకు షెడ్లు వినియోగించుకుంటే నెలకు స్క్వేర్ మీటర్ అద్దె సాధారణ వ్యాపారులకు రూ.100 అయితే మత్స్యకారులకు రూ.50 వసూలు చేయాలని నిబంధన విధించారు.షెడ్లలో 40శాతం స్థలం మత్స్యకారులకు కేటాయించాలని స్పష్టం చేశారు. కాంట్రాక్టు దక్కించుకున్న కంపెనీ ఆ తర్వాత దీని నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేసింది. సదుపాయాలు లేక బోట్ల తయారీ, మరమ్మతులకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇటువైపు చూడడమే మానేసింది. దీంతో ఇప్పటికీ ఇది నిరుపయోగంగా మారింది. టెండర్ పొందిన కంపెనీని రద్దు చేసి దీన్ని వినియోగంలోకి తీసుకువచ్చి సదుపాయాలు కల్పిస్తేనే ఎంతో కొంత మత్స్యకారులకు ఉపయోగం.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు

రెండేళ్లలో పోలవరం

- ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లిచ్చాం
- బీజేపీ పటిష్టానికి చర్యలు
- త్వరలో మన పార్టీ - మన జెండా
- కుంభమేళా తరహాలో పుష్కరాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే రెండేళ్లలో పోలవరం ఎడమకాలువ ద్వారా నీళ్ల ప్రవహించేలా పనులు శరవేగంగా జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం చాయ్‌పే చర్చ, సారథ్యం యాత్ర, బహిరంగ సభ నిర్వహించారు. బీజేపీని గ్రామస్థాయిలో పటిష్టం చేయడానికి 'మన పార్టీ మన జెండా' పేరుతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. వైసీపీ హయాంలో పోలవరం పనులు నత్తనడకన జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్లు ఇచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసులకు సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయన్నారు. కూటమిలో సముచిత స్థానం లభించడంలేదని కొంతమందిలో అసంతృప్తి ఉన్నమాట వాస్తవమే అయినా మూడు పార్టీలకు సమన్యాయం చేస్తూ పదవులు లభిస్తున్నాయనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కుంభమేళా తరహాలో రాజమహేంద్రవరం పుష్కరాలను నిర్వహించాలనే ఆలోచన జరుగుతున్నదన్నారు. రాజకీయ క్షేత్రం అంటేనే బురదమయం అన్నారు. దేవుడి దర్శనానికి వెళ్లాలంటే డబ్బులు ఇవ్వాల్సి రావడం బాధగానే ఉందన్నారు. అయోధ్య రామాలయంలో దర్శనం, ప్రసాదాల విషయంలో ఆదర్శవంతమైన వ్యవస్థ నిర్మాణమైంది. అలాంటి వ్యవస్థ అన్నిచోట్లా జరగాలన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ ప్రస్థానంలో కార్యకర్తల భాగస్వామ్యం ప్రధానమైందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ దిశ, దశ మార్చే శక్తియుక్తులు మాధవ్‌లో ఉన్నాయన్నారు. ముందుగా వై.జంక్షన్ నుంచి సుబ్రహ్మణ్య మైదానం వరకూ పెద్దఎత్తున ర్యాలీ చేశారు.

అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేసి అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలపై జిల్లాస్థాయిలో ఆడిట్ అనంతరం రాష్ట్రస్థాయిలో ఆడిట్ జరుగుతుందన్నారు. వివిధ సమస్యలపై 517 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి: ఎస్పీ



బాధితురాలి గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడక్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుదారుల అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ బిందుమాధవ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 48మంది అర్జీదారులు ఎస్పీ గ్రీవెన్స్‌ను సోమవారం ఆశ్రయించారు. అర్జీదారుల సమక్షంలోనే ఎస్పీ పోలీస్ అధికారులతో వీసీ నిర్వహించి బాధితుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఓకే అని 'పింఛెన్'!

- దివ్యాంగులకు యథావిధిగా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో మొత్తం 34,499 మంది పింఛనుదారులు
- అనర్హులు 2898 మందికి కూడా అందజేత
- ఈనెలలో కొంత ఊరట

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగపింఛన్లు పొందే వారిని ప్రభుత్వం గుర్తించింది. వారిని అర్హుల జాబితా నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టింది. బోగస్ సర్టిఫికెట్లతో పింఛను పొందుతున్న వారికి నోటీసులు పంపి ఏరివేత చర్యలు ప్రారంభించింది. కానీ, ఈనెలలో వారికి కూడా పింఛన్లు అందించారు.

జిల్లాలో మొత్తం 34,499మంది దివ్యాంగ పింఛనుదారులు ఉండగా వివిధ కారణాలతో 2898 మందిని అనర్హులుగా గుర్తించారు. వీరికి సెప్టెంబర్ నెల పింఛను రద్దు చేయాలని ప్రభుత్వం భావించింది. దీంతో తమకు పింఛను అందదని వీరంతా ఆందోళన చెందారు. అనర్హుల కంటే అత్యధికంగా అర్హులు పింఛన్ల రద్దు జాబితాలో ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. దీంతో తమ అర్హతను నిరూపించుకునే అవకాశం ఇవ్వడంతోపాటు యథావిధిగా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలోని దివ్యాంగ పింఛనుదారులకు సెప్టెంబర్ నెల పింఛను సొమ్ముకు సంబంధించి రూ.21.09 కోట్లను సోమవారం అందజేశారు.

లబ్ధిదారులు హర్షం

దివ్యాంగుల పింఛను విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనర్హత బారిన పడిన వారికి తిరిగి అప్పీలు చేసుకునేందుకు గడువు ఉన్న నేపథ్యంలో సెప్టెంబర్‌లో ఇచ్చే పింఛను పాత పద్ధతిలోనే ఇస్తున్నారు. దీంతో అనర్హత బారిన పడిన దివ్యాంగులకు ఈనెల ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్ల మంజూరు అడ్డుగోలుగా సాగింది. దివ్యాంగత్వం లేకపోయినా రాజకీయ పలుకుబడి, సదరం శిబిరాల్లో వైద్యులను మేనేజ్ చేసి బోగస్ సర్టిఫికెట్లు జారీ చేయించుకున్నారు. ప్రతినెలా పింఛను పొందుతూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బోగస్ బాగోతంపై దృష్టిసారించింది.

నోటీసులు జారీ

దివ్యాంగ పింఛన్ల వడపోతకు ప్రత్యేక వైద్య బృందాలతో వైకల్య నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. వీరి నివేదిక ఆధారంగా అనర్హులైన దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులు జారీ చేశారు. 85శాతం వైకల్యం ఉండి మంచాన పడిన వారికి యథావిధిగా రూ.15వేలు, 85శాతం కంటే తక్కువ ఉన్న వారిని రూ.6వేలకు మార్పు చేయనున్నట్టు పేర్కొన్నారు. 40శాతానికి పైబడి వైకల్యం ఉన్నవారికి రూ.6వేల పింఛను వస్తుందని, 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉండి, ఇప్పటికే 60ఏళ్ల దాటి ఉంటే రూ.4వేలు పింఛను ఇస్తామని, లేనిపక్షంలో వారికి పింఛను ఆగిపోతుందని స్పష్టం చేశారు. 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉందంటూ నోటీసులు అందుకున్న దివ్యాంగుల్లో ఎక్కువశాతంమంది అర్హులు ఉండడం చర్చనీయాంశమైంది. వయోవృద్ధులను సాధారణ జాబితాలో వేయడంతో అనర్హులతోపాటు కొందరు అర్హులు పింఛను కోల్పోయారు. దీంతో కొందరు అధికారుల వద్దకు మొరపెట్టుకోవడంతో అప్పీలుకు అవకాశం కల్పించారు.

ఈనెలకు అందజేశాం

ఈనెలకు సంబంధించి పాత జాబితా ప్రకారం పింఛన్లు అందజేశాం. రద్దయిన వారికీ పింఛను ఇచ్చాం. అప్పీలు చేసుకునేందుకు గడువు ఉండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాత జాబితా ప్రకారం ఎంతైతే పింఛను వచ్చిందో ఈ నెల కూడా అంతే పింఛను పంపిణీ చేశాం.

-జి.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ, కాకినాడ జిల్లా

2.72లక్షల మందికి పింఛన్ల అందజేత



జిల్లా ప్రత్యేకాధికారి పెదపూడి మండలం రామేశ్వరంలో పింఛన్లు అందిస్తున్న వీరపాండ్యన్

పెదపూడి(కరప), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెప్టెంబరు నెలకు సంబంధించి 2,72,497మంది లబ్ధిదారులకు రూ.117.66కోట్లను ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద అందజేసినట్టు జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్ తెలిపారు. పెదపూడి మండలం రామేశ్వరంలో సోమవారం పేదలకు సేవాకార్యక్రమంలో భాగంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైనవారందరికీ పింఛన్లను పూర్తిస్థాయిలో అందిస్తుందని, తొలగిస్తున్నారనే అపోహలను ఎవరూ నమ్మవద్దని హితవు పలికారు. అనంతరం వెలగపాటి రామలక్ష్మి, కొల్లాబత్తుల కుమారిలకు వితంతు పింఛను, శికోటి రాజేష్, కొల్లాబత్తుల మణిబాబులకు విభిన్న ప్రతిభావంతుల పింఛన్లను ఆయన అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సిబ్బంది ప్రతినెలా మొదటి రోజునే పింఛన్ అందిస్తున్నారా, కుటుంబసభ్యుల వివరాలు, వారి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వ సేవల వివరాలను పింఛన్‌దారులను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహశీల్దార్ పీవీ సీతాపతిరావు, రామేశ్వరం కార్యదర్శి ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

తొలిరోజు జిల్లాలో 90శాతం పింఛన్లు పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో తొలిరోజు సోమవారం 90శాతం పంపిణీ చేశారు.ఉదయం జిల్లాలో కాకినాడ నగరంతోపాటు ఇతరప్రాంతాల్లో ఆధార్‌సర్వర్‌లో సాంకేతిక సమస్యవల్ల పింఛన్ల పంపిణీకి ఆటంకం కలిగింది. జిల్లాలో 2,72,497మందికిగాను 2,45,241మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేశారు. రూ.117.66కోట్లకుగాను రూ.105.38కోట్లు లబ్ధిదారులకు అందజేశారు.

ఐవీఎఫ్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి

- లేకుంటే చట్టరిత్యా శిక్షార్హులు: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) సెంటర్లను ఎవరైనా అనుమతులు లేకుండా నిర్వహిస్తే వారు చట్టరిత్యా శిక్షార్హులని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏఆర్‌టీ, సరోగసీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయడంతోపాటు తప్పనిసరిగా జిల్లా అప్రాప్రియేట్ అథారిటీలో నమోదై సంబంధిత ఆస్పత్రులు చట్టంలోని సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. లేకపోతే జైలు శిక్షతోపాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ కాకుండా కేంద్రాలను నిర్వహిస్తే పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004253365, 9494113365 నెంబరుకు వాట్సప్ రాతపూర్వకంగా తెలియజేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో లెవల్-2లో సృజన ఐవీఎఫ్ సెంటర్, రాంభాస్కర్ ఐవీఎఫ్ సెంటర్, మెడ్‌వే సంజీవి హాస్పటల్, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ లెవల్-1లో లండన్ ఐవీఎఫ్ సెంటర్‌లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నట్లు తెలిపారు. ప్రజలంతా సంబంధిత సెంటర్లను మాత్రమే ఆశ్రయించాలన్నారు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డివిజన్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రశాంతి తదితరుల ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు జరుగుతున్నాయన్నారు.

రేపు ఎలుకల నివారణపై అవగాహన

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 3న ఎలుకల నివారణపై అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ తెలిపారు. ఎలుకలవల్ల పంటల నష్టం, బొరియల నివారణ పద్ధతులు వివరిస్తామన్నారు.

30ఏళ్ల చంద్రబాబు సేవ దిశా నిర్దేశం: జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి నేటికి 30ఏళ్ల పూర్తవుతోందని, మూడు దశాబ్దాల ఆయన సేవ రాష్ట్రానికి దిశా నిర్దేశంగా నిలిచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి బలమైన పునాది పడిందన్నారు. ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం, సంక్షేమ పథకాల విస్తరణ, ఐటీ విప్లవానికి శ్రీకారం, విద్య-వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు, వ్యవసాయానికి ఆధునిక సాంకేతికత జోడింపు పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు.



తీపి.. గణేశుడు





ధవళేశ్వరం బస్టాండ్ వద్ద 1500 కేజీల అనకాపల్లి బెల్లం కుందెలతో విశాఖపట్నంలో తయారు చేసిన 12 అడుగుల గణేశుడిని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని ధవళేశ్వరం తరలించడానికి సుమారు రూ.1.80 లక్షలు ఖర్చయినట్టు విఘ్నేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షుడు అప్పన్న తెలిపారు. - ధవళేశ్వరం

ఐడియాకో దండం!

కోనసీమ అంటే కొబ్బరికి ప్రసిద్ధి.. కొబ్బరితో ఏమేం చేయవచ్చో కోనసీమవాసులకు తెలిసినంతగ మరికెవరికీ తెలియదు.. ఈ సంఘటనే ఉదాహరణ.. పువ్వుల ధరలు మండిపోతున్నాయి.. దండ కొనుగోలు చేయాలంటే రూ.200పైనే ఉంటుంది.. అందుకే అంతర్వేదికి చెందిన పున్నం నాగేంద్ర, చిక్కాల సాయి కొబ్బరి ఆకులతో దండలు చేసి వినాయకులకు వేశారు.. భలేగుంది కదూ ఐడియా.. - అంతర్వేది

మూషిక వాహన గణేశా!



అయినవిల్లి శ్రీ సిద్ధివినాయక స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి లక్ష దూర్వార్చన, ప్రత్యేకాలంకరణ, పంచ హారతులు నిర్వహించారు. చవితి మహోత్సవాల్లో ఆరో రోజు శక్తి గణపతి అలంకారుడై మూషిక వాహనంపై స్వామివారిని మాడవీధి సేవ నిర్వహించారు. - అయినవిల్లి



ఘన.. పయ్యి!

పి.గన్నవరంలో ఆటోపై మండపం కట్టి గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భారత్ ఆటో యూనియన్ సభ్యులు

కల్పవృక్షం.. కొబ్బరిచెట్టు



కొబ్బరి పేరు చెప్పగానే మనందరికీ గుర్తొచ్చేది కోనసీమ. ఎటుచూసినా పైరు పచ్చని వరి చేలు.. కల్పవృక్షాల్లాంటి కొబ్బరిచెట్లు.. వాటికి నలుదిక్కులా కొబ్బరి గెలలతో కొబ్బరి చెట్లు కనువిందు చేస్తాయి. సూర్యరశ్మిని సైతం నేల పైకి పడకుండా గొడుగు మాదిరిగా ఉంటూ సూర్యకిరణాలు కొద్దిగా నేలపై పడుతూ కనిపించే దృశ్యాలు కోకొల్లలు. కోనసీమ రైతుల బతుకు బండి కొబ్బరి పంటపైనే ఆధారపడి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతుంటే అధిక భాగం కోనసీమలో విస్తరించి ఉండడంతో కోనసీమకు కొబ్బరిసీమ అని పేరు వినిపిస్తుంటుంది. కొబ్బరి చెట్ల అందాలను తమ కెమేరాల్లో బంధించేందుకు తహతహలాడుతున్నారు ఫొటోగ్రాఫర్లు, సినీ దర్శకులు. అందుకే చాలా సినిమాల్లో కోనసీమ కొబ్బరి అందాలు వర్ణిస్తూ ఎన్నో సినిమాలను కూడా చిత్రీకరించారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

» రికార్డు స్థాయిలో కొబ్బరి ధరలు

» నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం

కొబ్బరి దినోత్సవం ఇలా మొదలైంది..

అంబాజీపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా సెప్టెంబరు 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రపంచంలో కొబ్బరికాయల సాగులో మొదటిస్థానంలోఉన్న ఇండోనేషియా వ్యవస్థాపక దినోత్సవం ఇదేరోజున. ఆ దేశాన్ని గౌరవిస్తూ కోకోనట్ డేను ఈరోజు నిర్వహిస్తుంటారు. మనదేశానికి కూడా ఆ సంఘంలో సభ్యత్వం కావడం.. మనకూ కొబ్బరి మీదే ఓ రాష్ట్రం ఉండడం.. మనరాష్ట్రంలో కోనసీమంతా కొబ్బరి పరిమళాన్ని వెదజల్లడంతో ఆ దినోత్సవం ఇక్కడా ప్రత్యేకమైపోయింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొబ్బరిసాగు రైతుల సమక్షంలో కొబ్బరికాయల వాడకం ప్రాముఖ్యంపై ప్రజలకు తెలియచేయడం, కృత్రిమ శీతల పానీయాల కంటే కొన్ని రెట్లు మెరుగైన సహజసిద్ధమైన కొబ్బరినీళ్ల తాగడంలో ప్రయోజనాలు వివరించడం, కొబ్బరి పరిశ్రమలో పెట్టుబడులను ప్రోత్సహించడం వంటివి కోకోనట్ డే ప్రధాన లక్ష్యం.

కోనసీమ కొబ్బరి..

తెలుగువారికి కొబ్బరిఅనగానే కోనసీమ గుర్తుకు వస్తుంది. ఉభయగోదావరి జిల్లాలు విరివిగా కొబ్బరిపండిస్తే తూర్పుగోదావరి జిల్లానే మొత్తం రాష్ట్ర పంటలో సగం వరకూ ఉంది. అందులోనూ ఎక్కువ వాటా కోనసీమదే.నేల నాణ్యత, అధికతేమ, వర్షపాతం వంటి అంశాలు కోనసీమలో కొబ్బరిసాగుకు ఎంతగానో తోడ్పడతాయి. ఇక్కడి కొబ్బరి రైతులు కొబ్బరి చెట్లతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారు. వాటిని తమ కుటుంబసభ్యుల్లా చూసుకుంటారు. నిజానికి ఒక కొబ్బరి చెట్టు కొడుకుతో సమానమని చెప్పుకొంటారు. అంటే ఒక కొబ్బరిచెట్టు ఉంటే కుటుంబాన్ని సునాయాసంగా వెళ్లదీయవచ్చునని భావం. ఇప్పుడు ఉభయగోదావరి జిల్లాల్లో కొబ్బరి సాగు తగ్గుతోంది. ప్రభుత్వపరంగా సరైన ప్రోత్సాహం



లేక రైతులు నిరుత్సాహపడుతున్నారు. ఎకరానికి 10వేల కాయలు కాయించే కోనసీమ కొబ్బరి పంటను ఆధారం చేసుకుని విశేష నైపుణ్యాలు అభివృద్ధిఅయ్యాయి. కొబ్బరిచెట్లు ఎక్కేవాళ్లు, కాయలను ఒలిచే వాళ్లవంటి ప్రత్యేకమైన పనివాళ్లు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నారు.

కోనసీమదే అగ్రభాగం

కొబ్బరి పండించే దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు ముఖ్యమైనవి. వీటిలో ఆంధ్రప్రదేశ్ విషయానికి వచ్చేసరికి కోనసీమలోని అంబాజీపేటదే అగ్రభాగం. కేరళ అలెప్పి తర్వాత అంబాజీపేటదే అగ్రస్థానం. 1.25లక్షల హెక్టార్లలో కొబ్బరి పంట ఇక్కడ సాగవుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల నెల జీతం మాదిరిగా కొబ్బరి రైతులకు ఆదాయం సమకూరుతుంది. అందుకే ఈ పంట అంటే ఇక్కడి రైతులకు అమితమైన అభిమానం. జీవిత చరమాంకంలో ఉన్న వారు కన్న కొడుకు కంటే కొబ్బరి చెట్టునే ఎక్కువ ప్రేమిస్తాడు.. ఆరాధిస్తాడు.

కొబ్బరి చెట్టుకు ప్రత్యేక స్థానం

కొబ్బరిచెట్టు నిజంగానే కల్పవృక్ష సమానం. మన జీవనంలో కొబ్బరిచెట్టుకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. పచ్చికొబ్బరి నుంచి ఎండు కొబ్బరి వరకూ అనేక రకాలుగా కొబ్బరిని వంటల్లో వాడడం, కొబ్బరినూనె, కొబ్బరినీరు దివ్య ఔషధాలుగా వాడుతుంటారు. కొబ్బరి పీచుతో కార్పెట్లు, క్వాయర్ పరుపులు, తాళ్లు తయారు చేస్తారు. కొబ్బరి మట్టలు, వంట చెరకుగా ఉపయోగిస్తారు. కొబ్బరి ఆకు ఈనెలతో చీపుర్లు తయారు చేస్తారు. ఇటీవల పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రకాల ఆకృతులను తయారు చేసి వాటిని పెళ్లి మండపాలు, పందిర్లలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

ఎన్నడూ లేని విధంగా ధరలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కొబ్బరి ధరలు పుంజుకున్నాయి. పచ్చికాయల ధరలకు రెక్కలు రావడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం పచ్చికొబ్బరికాయల ధరలు రూ.22వేల పైబడి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.10వేలనుంచి అమాంతంగా రూ.22వేలకుపైబడి ధరలు పెరగడంతో రైతులు కొబ్బరితోటల వైపు దృష్టిసారించారు.

కొబ్బరి వల్ల ఉపయోగాలు

- కొబ్బరి గుజ్జులో 46శాతం తేమ, 37శాతం కొవ్వు, మిగతా శాతం లవణాలు, ప్రొటీన్లు, ఉంటాయి.
- కొబ్బరి ప్రొటీన్లలో అధికశాతం అమినోయాసిడ్లు ఉన్నాయి.
- ఎండు కొబ్బరి నుంచి తీసిన కొబ్బరి నూనెలోని కీటోన్, లాక్టోన్ ఆల్కాహాల్ వల్ల ఆ నూనెకు ప్రత్యేక వాసన వస్తుంది.
- ఆరోగ్యపరంగా నట్స్‌తో పోలిస్తే కొబ్బరిలో సంతృప్తికరమైన కొవ్వులు ఎక్కువ. అందులో ఆరోగ్యానికి మేలుచేసే లారిక్ ఆమ్లం చాలా ఎక్కువ. ఇది మోనోలారిన్ మారి అంటువాధ్యులు రాకుండా అడ్డుకుటుంది.
- లాక్టోజ్ పడని చిన్నారులు, గర్భిణులకు కొబ్బరినీళ్లు, కొబ్బరిని రుబ్బి తీసిన పాలను తీసి ఇస్తే గ్లూకోజ్‌లా పనిచేస్తుంది.
- కొబ్బరి నీరు శరీరాన్ని చల్లభరచడమే కాకుండా జీర్ణక్రియకు సంబంధించి సమస్యలను నివారిస్తుంది. అతిసార వ్యాధి బాధితులు ఆ సమస్యల నుంచి బయటపడేందుకు కొబ్బరి నీటిని తీసుకొంటే మంచిదని వైద్యులు చెప్తున్నారు.
- మూత్ర పిండాలు, మూత్ర నాళాల్లో ఏర్పడే రాళ్లను కరిగించే గుణం కొబ్బరినీట్లో ఉంది.
- మాములుగా కొబ్బరినూనె ఎండబెట్టిన కొబ్బరి నుంచి తీస్తారు. పచ్చికొబ్బరి నుంచి నూనె తీయవచ్చు.

రూ.లక్ష దాటి పరుగులు!

» 10గ్రాముల 24క్యారెట్ ధర రూ.1,05,870

» ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ ధర రూ. 97,050

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



బంగారంధరలు పైపైకి ఎగసిపోతున్నాయి. గతనెల వరలక్ష్మీవ్రతం రోజున బంగారం ధర భారీగా పెరిగిందనుకుంటే, ఇవాళ ఆ రికార్డులు బద్దలు కొట్టి, మరింత గా ధరలు పెరిగాయి. ఇప్పటికే బంగారం కొనుగోలు చేసినవారికి అది మంచి పెట్టు బడి వస్తువుగావారింది. సామాన్యులు మాత్రం నిరాశకు గురవుతున్నారు. సోమవారం రికార్డుస్థాయిలో బంగారం ధరలు పెరిగాయి. శని, ఆదివారాల్లో రాజమండ్రి మార్కెట్‌లో 22క్యారెట్ 10గ్రాముల బంగారం ధర రూ.96వేల 200గా ఉంది. సోమవారం ఈ ధర రూ.97,050కు చేరింది. ఏకంగా ఒక్కరోజులో రూ.850 పెరిగింది. ఇంకా రూ.3వేలు పెరిగితే రూ.లక్ష అయిపోతుంది. ఇక 24 క్యారెట్ బంగారం 10గ్రాముల ధర లక్ష ఎప్పుడో దాటేసింది. ప్రస్తుతం లక్షా5వేల 870గా ఉంది. వెండి ధర కూడా లక్షకు పైగా దాటేసి పరుగులు తీస్తోంది. కిలో వెండి ధర రూ.లక్షా 26వేల300గా ఉంది.

రామచంద్రపురం నియోజకవర్గాన్ని

కాకినాడ జిల్లాలో కలపాలి

● కాకినాడ జిల్లా జేసీకి వినతి పత్రం అందజేసిన ఎంపీపీలు, సర్పంచ్‌లు



రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని అతి దగ్గరలోఉన్న కాకినాడజిల్లాలో కలపాలని ఆ నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకినాడ కలెక్టరేట్లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ భౌగోళికంగా పరిశీలిస్తే రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడజిల్లాకు అతి సమీపంలో ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో ఉన్న కాజులూరు మండలాన్ని కాకినాడజిల్లాలో విలీనమైందన్నారు. ఈనేపథ్యంలో మిగిలిన రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కాకినాడజిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రామచంద్రపురానికి అతిదూరంలో ఉన్న కోనసీమజిల్లాలో దీన్ని కలపడంవలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చిన్నపనికి అమలాపురం వెళ్లడం ప్రజలకు కష్టంగా ఉందన్నారు. ఈనేపథ్యంలో ప్రజల అభీష్టంమేరకు రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో విలీనం చేయాలని కోరారు. కాకినాడ కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు.

కోనసీమ కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీలు, కౌన్సిలర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని సోమవారం రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన ఎంపీపీలు, రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిలర్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు ఇప్పటికే కాకినాడ జిల్లాలో ఉందని, రామచంద్రపురం రూరల్, అర్బన్, కె.గంగవరం మండలాలు గోదావరికి ఇవతల ఉన్నందున, భౌగోళికంగా దూరంగా మారినందున రామచంద్రపురం రూరల్, అర్బన్, కె.గంగవరం మండలాలతో కలిసి మొత్తంగా నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని పేర్కొన్నారు. రామచంద్రపురం పురపాలక సంఘం చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా మద్దతు పలుకుతూ సంతకాలుచేసిన పత్రాలు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, రామచంద్రపురం రూరల్ ఎంపీపీ అంబటి భవాని, గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, కట్టా గోవిందు, శ్రీను, బాలసుబ్రహ్మణ్యం, సత్యానందం, సూరిబాబు, శ్రీనివాస్, రాంబాబు, గోపాలకృష్ణ, వెంకట్రావు, దొరబాబు, బీఎస్పీ కాకినాడజిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాసిక్ నుంచి యానాం వరకు పాదయాత్ర

ఎటపాక, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోదావరినదీ పుట్టిన నాసిక్(త్రయంబకం) ప్రాంతం నుంచి యానాం వరకు భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తుల పాదయాత్ర సోమవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం నందిగామ గ్రామం వరకు చేరుకుంది. నాసిక్‌లోని గంగోత్రి ఆశ్రమంకు చెందిన భక్తులు గోదావరి నదీ ప్రాంతాల సందర్శన కోసం యాత్ర నిర్వహించారు. అయితే ఆగస్టు 3న నాసిక్ నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు .అయితే వీరి పాదయాత్ర 3నెలల పాటు సాగనుంది. సుమారు పదిమంది భక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పాదయాత్రగా సాగుతున్నారు.



నాసిక్ నుంచి పాదయాత్ర చేస్తున్న భక్తులు

ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు

● ప్రభుత్వ సలహాదారు షరీఫ్



ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం/సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉర్దూభాషలో బోధన అందించడానికి ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని ప్రభుత్వ సలహాదారు(మైనార్టీ వ్యవహారాలు) ఎంఏ.షరీఫ్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కొంతమూరు సమీపంలోని ప్రాథమిక, జడ్పీఉన్నత పాఠశాల, లక్ష్మీ వారపుపేటలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఉర్దూ విద్యాభివృద్ధికి తొలి నుంచీ సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 12 ఉర్దూ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించామన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లీషు మీడియంలో బోధనను అందుబాటులోకి తెచ్చి ప్రాథమికస్థాయి నుంచి జూనియర్ కళాశాల వరకూ ఉర్దూ నేర్చుకొనే విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకటో తరగతిలో కనీసం 10మంది, పాఠశాలలో మొత్తం 40 మందికిపైగా విద్యార్థులు ఉన్నచోట ప్రత్యేక ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చూస్తామన్నారు. ఇది ప్రభుత్వ పాలసీలో ఒక భాగమని చెప్పారు. ఉర్దూ విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం, మాతృభాషలో బోధన అందించే ఉపాధ్యాయుల నియామకం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒక భాగమని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభు త్వం కట్టుబడి ఉందన్నారు. ఉర్దూ బోధనా విష యంలో మైనార్టీల సమస్య తన దృష్టికి వచ్చిం దని, ప్రభుత్వ పాలసీ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చ య్యచౌదరి మాట్లాడుతూ కొంతమూరు ప్రాం తంలో వేలాదిగా ముస్లిం కుటుంబాలు ఉన్నా యన్నారు. ఎలిమెంటరీ పాఠశాలలో 180 మం ది, హైస్కూల్‌లో 134 మంది విద్యార్థులు చదువుతున్నా ఉర్దూ లేకపోవడం సమస్యగా ఉందని చెప్పారు. సర్వశిక్ష అభియాన్‌ద్వారా ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమలలో డీఈవో వాసుదేవరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, మైనార్టీ నాయకులు షేక్ సుభాన్, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, సొసైటీ చైర్మన్ అడ్డాల శ్రీను, డైరెక్టర్ యమన నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా చెవ్వూరి



చెవ్వూరి రవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడరూరల్,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లాకు చెందిన చెవ్వూరి రవి ఎన్నికయ్యారు. విజయవాడలోని లయోలా కళాశాలవద్ద గల ఎస్‌జే సెంటర్లో నిర్వహించిన సంఘ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చెవ్వూరి అధ్యక్షుడిగానూ, గుంటూరు జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగానూ, అనంతపురం జిల్లాకు చెందిన కేవీభాస్కర్ కోశాధికారిగానూ, కర్నూలుకు చెందిన ఓంకార్ యాదవ్ గౌరవాధ్యక్షుడిగానూ ఎన్నికకాగా అధ్యక్షుడిగా ఎన్నికైన చెవ్వూరి రవిని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ఎదుర్కొంటున్న కామన్ సీనియారిటీ సమస్య, క్లస్టర్ పాఠశాలలకు గ్రేడ్1 ప్రధానోపాధ్యాయుల నియామకం, ఆర్థిక సంబంధమైన సమస్యల సత్వరపరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సంఘ సభ్యులు, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన జట్టు

జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జట్టు ఎంపిక

●13, 14 తేదీలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

మండపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీలకు సంబంధించిన జట్టును ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. మండపేట- ఏడిద రోడ్డులోవున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్ ఉమ్మడిజిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ క్రీడా పోటీల ఎంపికకోసం 150మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. వచ్చిన వారిలో 24 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎం ముంగర వెంకట్రాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు గెడా శ్రీనివాసరావు మాట్లాడూతూ రాష్ట్రస్థాయిలో టెన్నికాయిట్ పోటీలను మండపేటలో నిర్వహిస్తామన్నారు. ఈనెల 13,14 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు 200మంది క్రీడాకారులు హాజరవుతారని వారు చెప్పారు. ఈ పోటీలకు వచ్చే క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అప్పాని కృష్ణకుమారి మాట్లాడుతూ మండపేటలో జరిగే పోటీలకు క్రీడాభిమానులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు వైద్య పరీక్షలు

కాకినాడక్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన 649 మంది అభ్యర్థులకు ఈనెల 2వ తేదీ నుంచి 8వరకు ఆరురోజులపాటు కాకినాడ జీజీహెచ్‌లో ఫిట్‌నెస్ రీత్యా వైద్య పరీక్షలు జరుగనున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విధిగా ఏఆర్, ఏపీఎస్పీ విభాగాల కేటగిరీలకు అనుగుణంగా, వారి రిజిస్ట్రేషన్ నెంబర్లను బట్టి ఆయా తేదీల్లో హాజరుకావాలని పేర్కొన్నారు. 2న రిజిస్ట్రేషన్ నెంబర్ 4003237 నుంచి 4126868 వరకు జరుగుతాయి. అలాగే 3వ తేదీన 4127974 నుంచి 4251533 వరకు, 4న 4254521 నుంచి 4493328 వరకు, 5న 4001955 నుంచి 4321734 వరకు, అలాగే 6వ తేదీన 4324322 నుంచి 4499757 వరకు, 7న రిజిస్ట్రేషన్ నెంబర్ 4106200 నుంచి 4247463 వరకు, సెప్టెంబరు 8న 4247699 నుంచి 4491931 వరకు ఈ వైద్య పరీక్షలు జరుగనున్నట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు వారి వైద్య పరీక్ష తేదీకి ముందు తగిన విధంగా సిద్ధం కావాలన్నారు. సంబంధిత ఆరోగ్య పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుని రావాలన్నారు.



స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామివారి పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భాద్రపద మాసంలో నవమినాటి రాత్రి నుంచి దశమి, ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు పూజా కార్యక్రమాన్ని మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ప్రారంభించారు. మొదటి రోజు అర్చకులు దీక్షారాధన చేసి మూలవరులకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంచేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం నవకలశారాధన, సప్త కలశారాధన, పవిత్రాలకు అర్చనలు, స్వామివారి పురాతన కల్యాణ మండపం వద్ద నిర్వహించి స్వామివారికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడి ఎంపిక



బుర్రి పీయూష్

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం లూథియానాలో ఈనెల 2నుంచి 9వ తేదీ వరకూ జరిగే 75వ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టుకు పట్టణానికి బుర్రి పీయూష్‌ను ఎంపి క చేయగా, ఇప్పటికే బయలుదేరి వెళ్లాడు. పీయూష్‌ను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, బొజ్జా మాణిక్యాలరావు, కోశాధికారి కొత్తెం సుందరకుమార్, వీఎస్‌రెడ్డి, ఎం.రాజారావు, నంబోల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి ఆదాయం రూ.1.69 కోట్లు

అన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,69,06,902 నగదు, 39 గ్రాముల బంగారం, 765 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటు యూఎస్ఏకు చెందిన 170 డాలర్లు, యుఏఈ 455 దిరహమ్స్, సింగపూర్ 5 డాలర్లు, ఇంగ్లాండ్ 25 పౌండ్స్, పలుదేశాల కరెన్సీని భక్తులు హుండీల్లో వేశారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, సేవాసంస్థల సభ్యులు పాల్గొన్నారు. 32రోజులకు ఈ ఆదాయం సమకూరగా రోజుకు సరాసరిన రూ.5.28 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించారు.



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పాఠశాలలో అదృశ్యమై... కాలువలో శవంగా తేలి..

- పాఠశాల వదిలి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు
- రెండు రోజుల తర్వాత దొరికిన విద్యార్థి మృతదేహం
- పోస్టుమార్టం అడ్డుకున్న బంధువులు, రైతుకూలీ సంఘ నాయకులు

రంపచోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.వివేకానందరెడ్డి (14) సోమవారం రంపచోడవరంలోని ఓ వాగులో శవంగా తేలాడు. వివరాల ప్రకారం.. రంపచోడవరం మండలం ఇసుకపట్ల గ్రామానికి చెందిన వివేకానంద రెడ్డి రంపచోడవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌తో సహా ఇతర ఉపాధ్యాయులెవరూ లేని సమయంలో ఆరుగురు విద్యార్థులు పాఠశాల వదిలి వాగు వద్దకు వెళ్లారు. కాగా అందులో వివేకానందరెడ్డి తప్ప మిగతా వారందరూ వెనక్కి వచ్చేశారు. వివేకానందరెడ్డి కోసం గాలించినా ఆచూకీ లభించలేదని ఐటీడీఏ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థి అదృశ్యమైన సమాచారం ఉన్నతాధికారులెవ్వరికీ పాఠశాల నిర్వాహకులు ఇవ్వలేదు. శనివారం ఉదయం వివేకానందరెడ్డి మృతదేహాన్ని రంపచోడవరంలో ఓ వాగు వద్ద గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శవపరీక్షను మాత్రం మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా విద్యార్థి బంధువులు, రైతుకూలీ సంఘం నాయకులు అధికారుల తీరుపై ఆందోళనకు దిగారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చూడడానికి వచ్చే తల్లిదండ్రులను కట్టడి చేసేందుకు ఉన్న నిబంధనలను పిల్లలు పాఠశాలలు వదిలి వెళ్లకుండా చేసేందుకు లేవా అంటూ గిరిజన సంక్షేమ డీడీని నిలదీశారు. బాధ్యులైన వారిపై సస్పెండ్ చేసి వదిలేయడం కాకుండా సర్వీసు నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. తమ డిమాండ్ల మేరకు న్యాయం చేస్తేనే మంగళవారం పోస్టుమార్టం జరగనిస్తామని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని విద్యార్థి కుటుంబసభ్యులు చెప్పారు.



విద్యార్థి మృతదేహం

హెచ్‌ఎం, వార్డెన్‌తో సహా నలుగురు సిబ్బంది సస్పెన్షన్

విద్యార్థి వి.వివేకానందరెడ్డి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఆగస్టు 30 నుంచి వివేకానంద రెడ్డి కన్పించడంలేదని పాఠశాల సిబ్బంది బంధువుల ఇళ్లలో వెతికారని, సోమవారం కాలువలో శవమై కన్పించాడన్నారు. విషయంపై పాఠశాల సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోగా విద్యార్థి మృతిపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రధానోపాధ్యాయుడు టి.రాజబాబు, వార్డెన్ కుంజం వెంకన్నదొర, ఉపాధ్యాయుడు గరుజుల ధరణిధర్, సీఆర్‌టీలు ఎం.సత్యనారాయణ, లోత చంటిబాబు, సీఆర్‌టీ ఫిజికల్ డైరక్టర్ కె.ప్రసాదరావుదొరను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు పీవో తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిలకడగా గోదావరి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- 13.10 అడుగులకు చేరిన నీటి మట్టం
- ఎగువ ప్రాంతాల్లో గోదావరి తగ్గుముఖం

ధవళేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తుంది. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు నీటి మట్టం 13.10 అడుగుల వరకు పెరిగింది. ఆపై 16గంటలు నిలకడగా కొనసాగుతుంది. సోమవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం అదే రీడింగ్ వద్ద కొనసాగుతుండగా కాటన్ బ్యారేజ్ ద్వారా 11,79,236 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. కాగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుంది.



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

భద్రచాలం, కాళేశ్వరం వద్ద...

భద్రచాలం వద్ద 48.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం 12గంటల పాటు నిలకడగా కొనసాగి తగ్గుముఖం పడుతుంది. సోమవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 43.60 అడుగులకు చేరుకుంది. ఎగువున కాళేశ్వరం వద్ద 12.570 మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ సోమవారం సాయంత్రానికి 9.650 మీటర్లకు చేరుకుంది. పేరూరు వద్ద 16.850మీటర్ల వరకు పెరిగి తగ్గుతూ 14.370 మీటర్లకు చేరుకుంది. దుమ్ముగూడెం వద్ద తగ్గుతున్న నీటి మట్టం 11.800 మీటర్లు, కూనవరం వద్ద 19.610, కుంట వద్ద 10.820, పోలవరం వద్ద 12.750 మీటర్లుగా నీటి మట్టం చేరుకుంది. రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.540 మీటర్లు, ధవళేశ్వరం వద్ద 13.10 అడుగుల వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది.

ఏలేరులో పెరుగుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న గోదావరి జలాలతో పాటు వరద నీరు వచ్చి చేరడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. పురుషోత్తపట్నం నుంచి 1050 క్యూసెక్కుల చొప్పున నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా సోమవారం 14.55 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 80.98 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



జలాశయంలో నీటి నిల్వలు

ఏసీబీకి చిక్కారు..

- ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి
- రూ.28 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్, కారు డ్రైవర్
- కేసు నమోదు

ఆలమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోమవారం ఏసీబీ దాడులు నిర్వహించింది. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వాసుకృష్ణ, భాస్కర్, సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పొలం రిజిస్ట్రేషన్ నిమిత్తం రైతు వద్ద నుంచి నగదు డిమాండ్ చేసి తీసుకుంటుండగా సబ్‌రిజిస్ట్రార్‌ను పట్టుకున్నారు. ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన గట్టి సుబ్రహ్మణ్యం అనే రైతు తన పేరు మీద ఉన్న 1.37 ఎకరాల భూమిని తన కుమారుడికి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.50 వేలు ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ కొన విమలస రోజినీ కుమారి లంచం డిమాండ్ చేసింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముప్పిరి వెర్రియ్య ద్వారా బేరం చేసుకుని రూ.28 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో గట్టి సుబ్రహ్మణ్యం ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం రిజిస్ట్రేషన్ అనంతరం రూ.28వేల నగదును సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి కారు డ్రైవర్ డి.దుర్గాప్రసాద్‌కు ఇస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్టు డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నగదుతో పాటు కార్యాలయంలో అదనంగా ఉన్న రూ.35 వేల నగదును కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి, కారు డ్రైవర్ దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.



ఏసీబీ దాడిలో పట్టుపడ్డ ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ సరోజినికుమారి, కారు డ్రైవర్



రైతు సుబ్రహ్మణ్యం

విద్యార్థినికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన అధ్యాపకుడి సస్పెన్షన్

అన్నవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం అధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన అధ్యాపకుడిని సస్పెండ్ చేస్తూ సోమవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడికిగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న లచ్చన్న అనే ఉద్యోగి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినికి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడని సోమవారం మీడియాలో కథనాలు రావడంతో ఈవో విచారణ చేసి నిర్ణయం తీసుకున్నారు.

మద్యం తాగి విధులకు హాజరైన దేవస్థానం ఉద్యోగిపై...

అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్‌లో పనిచేస్తున్న దేవస్థానం ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాదం కౌంటర్‌లో పనిచేస్తున్న ముని రాజేంద్రప్రసాద్ అలియాస్ కొంతం పండు మద్యం తాగి ప్రసాదం విక్రయాలు చేస్తున్నాడని భక్తుల ఫిర్యాదు మేరకు దేవస్థానం భద్రతా విభాగం అధికారులు తనిఖీ చేపట్టగా నిజమేనని నిర్ధారణకు వచ్చి ఈవోకు నివేదించడంతో చర్యలు తీసుకున్నారు.

ఏలేశ్వరం కమిషనర్ సస్పెన్షన్

ఏలేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 21న బిల్డిం గ్ కాంట్రాక్టర్ నుంచి రూ.23 వేలు లంచం తీసుకున్న కమిషనర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అరుణాచలాన్ని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వారిపై అధికారులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో ఆగస్టు 21 నుంచి కమిషనర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

తోడుంటానని బంగారు నగలు చోరీ

మహిళపై పోలీసులకు ఫిర్యాదు

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తోడుగా ఉంటానని చెప్పి వచ్చి ఒక మహిళ నగలు చోరీ చేసిందని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం పల్లపువీధికి చెందిన సురవత్తుల సత్యవేణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మే నెలలో తన భర్త చనిపోయాడని, తనకు తోడుగా ఉండేందుకు ఇసుకపల్లికి చెందిన రమాదేవి అనే మహిళ వచ్చిందని, 5కాసుల విలువైన బంగారు ఆభరణాలు అపహరించి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొంది.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

నిడదవోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం జరిగింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామానికి చెందిన రేకపల్లి సీతామహాలక్ష్మి (70) సుమారు నెల క్రితం నిడదవోలు పట్టణంలోని ఓ కంటి ఆసుపత్రిలో కంటికి ఆపరేషన్ చేయించుకుంది. సోమవారం వైద్యులకు చూపించుకునేందుకు నిడదవోలు వచ్చింది. అయితే పట్టణంలో ఆర్వోబీ పనులు జరుగుతున్నందున ఆర్టీసీ బస్సులను బసివిరెడ్డిపేట శివాలయం వద్ద నిలిపివేస్తున్న నేపథ్యంలో అక్కడ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు సీతామహాలక్ష్మి రైలు పట్టాలు దాటుతుండగా విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో మృతిచెందిందని స్థానికులు పేర్కొన్నారు. మృతురాలికి భర్త, ఐదుగురు కుమార్తెలు ఉన్నారని బంధువులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో సీతామహాలక్ష్మి మృతదేహం



ఫైల్‌ఫొటో

ఏకే మల్లవరంలో ఒడిసా యువకుడి ఆత్మహత్య

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఒడిసా రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఒడిసా రాష్ట్రంలోని నవరంగపూర్ జిల్లా నేలగుండిగూడ గ్రామానికి చెందిన బైదనాద జానీ (17) ఏకేమల్లవరం గ్రామానికి చెందిన ముదునూరి ధనుంజయవర్మ రొయ్యల చెరువులో పనిచేసేందుకు కూలీ పని నిమిత్తం వచ్చాడు. ఆదివారం రాత్రి 9.30గంటల సమయంలో రొయ్యలచెరువు నుంచి బయటకు వెళ్లిన అతడు కాలువ గట్టు వద్ద గల వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి గల ప్రేమ వ్యవహారం, కుటుంబం ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్తున్నారు. యువకుడి తండ్రి మన్ బత్ జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ సోమవారం తెలిపారు.

బెహరాన్‌లో పుల్లేటికుర్రు మహిళ మృతి

మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చిన ఏపీఎన్‌ఆర్టీఎస్ సంస్థ

అంబాజీపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం బెహరాన్ దేశం వెళ్లి అక్కడ మృతి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన కాగిత అర్జమ్మ (62) మృతదేహాన్ని ఏపీఎన్‌ఆర్టీసీ సంస్థ కృషితో స్వగ్రామానికి తీసుకువచ్చారు. వివరాల ప్రకారం.. అర్జన 10 ఏళ్లుగా ఉపాధి నిమిత్తం బెహరాన్‌లో ఉంటుంది. అయితే గత నెల 14న అనారోగ్యంతో అక్కడ మృతిచెందింది. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు రూ.3లక్షల వరకూ ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సంస్థ, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సంస్థ సంయుక్తంగా నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్టు, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సంస్థలు ఖర్చు భరించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా కృషిచేశారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సంస్థ సభ్యులు నల్లి రవిశంకర్, కొల్లు సరోజిని, గంజి వెంకటలక్ష్మి, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు ఓ బాలరాజు, సర్పంచ్ జల్లి బాలరాజు, ఉపసర్పంచ్ వీరా రవి, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, కాండ్రేగుల గోపి, అందె మూర్తి, నాయకులు ఎల్.భాస్కరరావు, కత్తుల బాలరాజు, బాలస్వామిలకు పుల్లేటికుర్రు ఎస్సీ యూనియన్ కమిటీ సభ్యులు, మృతురాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



అర్జమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ బాలరాజు, నాయకులు

మస్కట్ నుంచి స్వగ్రామానికి...

కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కృషితో చేరిన మహిళ

అమలాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో ఆరోగ్యం బాగోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మన్యం నాగమణి కోనసీమ సెంటర్‌ఫర్ మైగ్రేషన్ కృషితో సోమవారం క్షేమంగా స్వగ్రామం చేరుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలానికి చెందిన సరెళ్ల దివ్య తన తల్లి మన్యం నాగమణి మస్కట్‌లో పడుతున్న ఇబ్బందులను గుర్తించి తిరిగి స్వగ్రామం రప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఏజెంట్‌ను సంప్రదిస్తే రూ.1.60లక్షలు కడితేనే ఆమె స్వగ్రామానికి రాగలుగుతుందని చెప్పాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రత్యేకంగా వలసదారుల కోసం సెంటర్ ఫర్‌మైగ్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు దివ్య తెలుసుకుంది. వెంటనే సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులను ఆశ్రయించగా ఏజెంట్‌తో మాట్లాడి మస్కట్ దేశం నుంచి నాగమణిని స్వగ్రామం క్షేమంగా తీసుకువచ్చారని ఆనందంతో తెలిపింది.



మన్యం నాగమణి

కాకినాడలో కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి

- బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు
- స్వల్ప లాఠీ చార్జి, పలువురికి గాయాలు



కాకినాడలో బీజేపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించారు. మెయిన్‌రోడ్, సినిమారోడ్ కూడలిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇనుప కంచెలను బీజేపీ శ్రేణులు తోసుకుంటూ కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పరిస్థితిని అదుపులో తేవడానికి పోలీసులు స్వల్ప లాఠీ చార్జి చేసి అడ్డుకున్నారు. దీంతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం బయట రోడ్డు మీద బైఠాయించి రాహుల్ గాంధీ చిత్రపటాన్ని చెప్పుతో కొడుతూ మహిళలను గౌరవించని రాహుల్‌గాంధీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్ యాదవ్, చోడిశెట్టి రమేష్, సాహతీవర్మ, జిల్లా కార్యదర్శి జ్యోతుల రాజేష్, మండలాధ్యక్షుడు దొడ్డి వీరేంద్ర, పలువురు నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు. ఘటనలో గాయపడిన నాయకులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లి పంచాయతీ లంకొశెట్టిపేటకు చెందిన గుత్తుల ప్రసాద్(36) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. అతడు గణేశ నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ కారణంగా గుండె ఆగి కుప్పకూలాడంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. ప్రసాద్ ఉదయం నుంచి అనారోగ్యంగానే ఉన్నాడని, ఊరేగింపు నుంచి ఇంటికి వచ్చి ఛాతిలో మంటగా ఉందనడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు స్థానికులు, బంధువులు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా తమ సిబ్బంది ఊరేగింపులో ఉన్నారని, అక్కడ ఎటువంటి సంఘటన జరగలేదని ఎస్‌ఐ చలమల రాజేష్ తెలిపారు.



ప్రసాద్ (ఫైల్)

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

గండేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని సూరంపాలెంలో ఓ ప్రయివేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. పార్వతీపురం జిల్లా సాలూరు మండలం దేవబుచ్చంపేట గ్రామానికి చెందిన జి.మనోజ్ (21) సూరంపాలెంలో ప్రయివేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. స్నేహితురాలికి, తనకు మధ్య మనస్పర్థలు రావడంతో ఆదివారం హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై అతడి తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గండేపల్లి పోలీసులు తెలిపారు.



మనోజ్(ఫైల్)

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వయోజనులందరికీ అక్షరజ్ఞానం

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వయోజనులందరికి అక్షరజ్ఞానం కల్పించడం లక్ష్యంగా పనిచేయాలని పిఠాపురం మునిసిపల్ కమిషనరు నామకనకారావు సూచించారు. పిఠాపురంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ అక్షర ఆంధ్ర వలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పట్టణంలో 6620మంది నిరక్షరాస్యులకుగాను 662మంది వాలంటీర్లునునియమించినట్లు తెలిపారు. మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, త్రిమూర్తులు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నాయి కాపాడండి

● జాతీయరహదారిపై రాస్తారోకో
● ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

గొల్లప్రోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు 216వ జాతీయరహదారిపై బి.ప్రత్తిపాడు జంక్షన్ మృత్యుకుహరంగా మారిందని, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పాఠశాలల విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గొల్లప్రోలు పట్టణం నుంచి బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం సహా ఎనిమిది గ్రామాలకు జాతీయ రహదారిపైగల ఇదే జంక్షన్ ద్వారా రాకపోకలు సాగిస్తూ ఉంటారని బి.ప్రత్తిపాడు గ్రామస్థులు తెలిపారు. ఈజంక్షన్‌వద్ద తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. పవన్‌సారూ ప్రాణాలు పోతున్నాయి కాపాడాలంటూ వారు నినాదాలు చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని ఇక్కడ ప్రమాదాల నివారణకు చర్య లు చేపట్టడంతోపాటు ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. పవన్‌వలనే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అనంతరం పాడా కార్యాలయానికి ప్రదర్శనగా తరలివెళ్లారు. ఆందోళనలో సర్పంచ్ ఊటా రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు హామీలు నెరవేర్చాలి : శేషుబాబ్జి

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెచేసిన సమయంలో ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు, కూటమినేతలు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో సోమవారం సీఐటీయూ అనుబంధ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిఠాపురం ప్రాజెక్టు సమావేశం జిల్లా అధ్యక్షుడు దడాల పద్మ ఆధ్వర్యంలో జరిగింది. వర్కర్లుకు కనీస వేతనాలు ఇవ్వాలని, కొత్త సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు అందజేయాలన్నారు. ఇప్పటికే పనిచేయని ఫోన్లను అధికారులకు తిరిగి ఇచ్చివేశారని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది.

పేదవారి బతుకులకు ఆసరా ఎన్టీఆర్ భరోసా : మంత్రి సుభాష్




కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామంలో పింఛన్లను అందిస్తున్న మంత్రి సుభాష్, కాకినాడలోని జగన్నాథపురంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కొండబాబు

కాజులూరు(కరప),సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదవారి బతుకుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆసరాగా నిలుస్తున్నాయని, పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం జగన్నాధగిరి గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 62.95లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద రూ.32,520కోట్లను వెచ్చిస్తుందన్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15వేలు చొప్పున అందిస్తున్నామన్నారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా జగన్ రద్దుచేసిన 210 అన్నా క్యాంటీన్‌లను తెరిచి నిత్యం 2.5లక్షల మంది ఆకలి తీర్చుతున్నామన్నారు. గత ప్రభుత్వం బకాయిపెట్టిన ధాన్యం డబ్బు రూ.1,674కోట్లను విడుదలచేసి 85వేల మంది రైతులకు మేలు చేశామన్నారు. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, ఎంపీడీవో జె.రాంబాబు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ పెన్షన్ అందిస్తాం'

కాకినాడ సిటీ(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పెన్షన్ అందిస్తామని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్థానిక జగన్నాధపురం 21వ డివిజన్‌లో సోమవారం ఇంటింటికి వెళ్లి పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కూటమి ప్రభుత్వం రూ.4వేల నుంచి రూ.15వేల వరకు వివిధ రకాల పెన్షన్‌లు అందిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా దివ్యాంగుల నకిలీ సర్టిఫికెట్లు పుట్టించి అర్హులకు అందాల్సిన పెన్షన్‌లను దారి మళ్లించారన్నారు, స్థానిక నాయకులు పసగడుగుల శేషగిరిరావు, ఇమంది చంద్రరావు, బూడి ప్రకాష్, తెప్పల రామలింగేశ్వరరావు, సయ్యద్ ఆలీ, తాడిచర్ల వెంకటేశ్వరరావు, ఇమామ్ సాహెబ్, అయేషా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఇద్దరు పౌరులు ఫోన్ ద్వారా తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ వంటి విభాగాలకు సంబంధించి 12కు పైగా అర్జీలు అందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృద్వీచరణ్, ఎస్ఈ పి.వెంకట్రావు, మేనేజర్ సీతారాం, టీపీఆర్‌వో శైలజ, అకౌంటెంట్ రామశాస్త్రి, ఉద్యానవనశాఖ ఏడీ సిరిల్, ఏఈలు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలపై అందే అర్జీలను సత్వరం పరిష్కరించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి అధికారులను ఆదేశించారు. పిఠాపురం పాతబస్టాండు వద్దగల పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికకు ప్రజలు నుంచి 48 వినతులు, ఫిర్యాదులు అందాయి. వీటిని పాడా పీడీ స్వీకరించారు. ప్రజలు తమ అర్జీల నమోదు, వారి పురోగతి తదితర వివరాలను 1100కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనర్ నామ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆవులు, కుక్కలను నియంత్రించాలి

పట్టణంలో రహదారులపై విచ్చలవిడిగా ఆవులు, కుక్కలు సంచరిస్తున్నాయని, వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మన ఊరు మన బాధ్యత సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్‌లు కోరారు. ఆవుల వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని తెలిపారు. కుక్కలు వాహనదారులు, పాదచారులపై దాడిచేసి కరుస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వీటిపై తగు చర్యలు చేపట్టాలని వారు పీడీని కోరారు.

స్మార్ట్ రేషన్‌కార్డులతో అక్రమాలకు అడ్డుకట్ట

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను చూపిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం ఈస్మార్ట్ కార్డులను జారీ చేసినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేకూర్చేందుకు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. స్మార్ట్ కార్డువల్ల పౌరసరఫరాల వ్యవస్థలో పారదర్శకత తీసుకురానున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీరమణి, తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ తుమ్మల పద్మజ, కూటమి నేతలు పాల్గొన్నారు. జితేంద్ర, సూపరింటెండెంట్ కృష్ణకుమారి, ఎం ఎస్‌వోలు శ్రీనివాస్, అనిల్‌కుమార్, కూటమి నాయకులు మల్లిపూడి వీరు, శేషగిరిరావు, కొక్కిలగడ్డ గంగరాజు, దుర్గాప్రసాదక్ష, గొరుసు వెంకట దుర్గారావు, బూడి ప్రకాష్, సంగాని సత్యం, మనోహర్ గుప్త, దొరబాబు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసమే రేషన్‌కార్డులు



సీతారామపురంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీలు

తాళ్లరేవు(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులను తీసుకువచ్చిందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. సోమవారం కోరింగ పంచాయతీ పరిధి సీతారామపురం రేషన్‌షాపులో స్మార్ట్‌రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ప్రతీనెల పండుగరోజులా పెన్షన్లు పంపిణీ చేస్తుందన్నారు. సర్పంచ్ పెయ్యల మంగేష్, శెట్టిబలిజ కార్పరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ సరుకుల అక్రమాలకు చెక్

కాకినాడ సిటీ(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురంలోని రజకుల కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం కొండబాబు మాట్లాడుతూ ఇది కూటమి ప్రభుత్వానికి వచ్చిన స్మార్ట్ ఆలోచన అని, గతంలో మాదిరిగా పెద్ద సైజ్ కార్డు కాకుండా ఏటీఎం కార్డు సైజులో లబ్ధిదారుడి ఫొటోతో స్మార్ట్ రేషన్ కార్డు ఇస్తామన్నారు. అర్బన్ తహసీల్దార్ వి.

బీజేపీ శ్రేణుల ముట్టడిని అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

కాకినాడ సిటీ, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి) : కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి వచ్చిన బీజేపీ శ్రేణులను సోమవారం సాయంత్రం కాంగ్రెస్ కార్యాలయం గేటు దగ్గర ఆ పార్టీ నాయకులు అడ్డుకున్నా రు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణుల ముట్టడిని తిప్పి కొట్టారు.

నల్ల రిబ్బన్లు ధరించి నిరసన

సామర్లకోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత పెన్షన్‌సాధనకై విజయవాడలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న పెన్షన్ మార్చ్ నిరసన కార్యక్రమానికి మద్దతుగా సామర్లకోట మండలంలోని అన్ని గ్రామాల, పట్టణాల సచివాలయాల ఉద్యోగులు నల్లరిబ్బన్లు ధరించి నిరసన పాటించారు. ఒక పక్క ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటూనే ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది వీర మల్ల లోవరాజు, దొమ్మేటి రవికిరణ్, నూనె హేమలత, దుర్గ దేవి, ప్రవీణ్‌కుమార్, మర్రిపూడి శ్రీనివాసు, మణికంఠ, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విప్లవానికి ఎస్ఐవో నాంది

కాకినాడసిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహత్తర విద్యా విప్లవానికి స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐవో) ఆంధ్రప్రదేశ్‌శాఖ ఎడ్యుకేషన్ మూవ్‌మెంట్ పేరిట నాంది పలికిందని ఆ సంస్థ నాయకులు పేర్కొన్నారు. సోమవారం సంస్థ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) 40వ జాతీయ నేత్రధాన పక్షోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జరుగుతున్న ఈ పక్షోత్సవాలలో భాగంగా డీపీఎం, డీటీసీఎస్ ఆధ్వర్యంలో ఎంఎల్‌పీహెచ్ అలాగే వైద్య సిబ్బందికి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి నేత్రధానం ఇద్దరికి వెలుగును ప్రసాధిస్తుందని తెలియజేశారు. అనంతరం కాకినాడ జీజీహెచ్ నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరు నేత్రదానం చేస్తామని ప్రతిజ్ఞ పత్రాలను అందజేశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్ స్వప్న, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి శ్రీవిద్య, అప్తాల్మిక్ ఆఫీసర్లు, డిఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల తొలగింపుపై మహిళల ఆందోళన

సర్పవరంజంక్షన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల సౌకర్యార్థం పూర్వం నిర్మించిన సామూహిక మరుగుదొడ్డిని అధికారులు తొలగించడంపట్ల మత్స్యకార మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కాకినాడరూరల్ సూర్యారావుపేట గ్రామంలో లైట్‌హౌస్ నుంచి జెమినీ ఆయిల్ కంపెనీ మీదుగా నిర్మాణంలో ఉన్న సాగరమాల నేవెల్ రోడ్డుకి అడ్డుగా ఉన్న బహి రంగ మరుగుదొడ్డిని అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మత్స్యకార పెద్దల ఆధ్వర్యంలో మహిళలు ముందస్తు సమాచారం లేకుండా, ప్రత్యామ్నాయంగా మరుగుదొడ్డి నిర్మించకుండా ఎలా తొలగిస్తారంటూ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సంఘటనా స్థలానికి ఎంపీడీవో పసుపులేటి సతీష్, తహశీల్దార్ కుమారి, తిమ్మాపురం ఎస్ఐ గణేష్‌కుమార్‌లు చేరుకుని మహి ళలు, గ్రామ పెద్దలతో చర్చించారు. బహిరంగ మరు గుదొడ్డి ఉన్న స్థలం నేవెల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్డు మధ్యలో వచ్చిందని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ మరుగుదొడ్డి నిర్మాణం కోసం రూ. 15 లక్షలు మంజూరు చేశారని ఎంపీడీవో సతీష్ చెప్పారు. మంగళవారం ఉదయం నుంచి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని హామీఇచ్చారు. దీంతో మత్స్యకార పెద్దలు, మహిళలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఆర్ ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి లక్ష్మి, వీఆర్వో చిన్న తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్లో సోమవారం విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. కాకినాడజిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ నిధులు రూ.4లక్షల ఐదువేలతో 9మంది ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు ఇచ్చామన్నారు. అర్హులైన డిగ్రీచదువుతున్న దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ శ్రీనివాసు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

● కాకినాడ జిల్లా గణేష్ ఉత్సవసమితి ప్రతినిధులు



పుష్పాలంకరణలో జైగణేష్



సామర్లకోటలో నిమజ్జనం దృశ్యం



ఉప్పాడ బీచ్ వద్ద నిమజ్జనానికి తీసుకెళుతున్న విగ్రహాలు

పిఠాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ వినాయక నిమజ్జనాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని గణేష్ ఉత్సవ సమితి కాకినాడజిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉత్సవసమితి గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, గౌరవ సలహాదారు దువ్వూరి సుబ్రహ్మణ్యంలు సోమవారం పిఠాపురం పట్టణంలోని వినాయక మండపాలను సందర్శించారు. ఆయా ఉత్సవకమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రదర్శనకు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవ సమితి నగర ప్రతినిధులు పాడా పీడీ చైత్రవర్షిణి, పిఠాపురం సీఐ, తహసీల్దారు, మునిసిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు.

పుష్పాలంకరణలో జైగణేష్ స్వామి

పిఠాపురం పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో వేంచేసి ఉన్న జైగణేష్ దేవస్థానంలో జరుగుతున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేషపూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. జైగణేష్ స్వామి వివిధ రకాల పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం స్వామి పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానఅర్చకుడు మైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజాదికార్యక్రమాలు జరిగాయి.

బాధ్యతగా ఉంటూ నిమజ్జనం జరుపుకోవాలి

కరప(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలని కరప ఎస్‌ఐ తోట సునీత కోరారు. కరపమండలం పెనుగుదురు, వేళంగి, గొర్రిపూడి, ఉప్పలంక, అరట్లకట్ట గ్రామాల్లోని నిమజ్జనం జరిగే కాలువల వద్ద సోమవారం ఆమె హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి మాట్లాడారు. స్వామి వారి ఊరేగింపు ప్రారంభం నుంచి ముగింపు వరకు కమిటీలే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

● గొర్రిపూడిలో సోమవారం గణనాధుడి నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. గ్రామంలోని ఏడు గణేష్ మండపాల నుంచి వివిధ ఆకృతుల్లో ఉన్న వినాయక ప్రతిమలు ఊరేగింపుగా బయలుదేరి స్థానిక తుల్యభాగ డ్రైన్‌లో నిమజ్జనం చేశారు.

ఉప్పాడ రేవులో..

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో వినాయక చవితి పునస్కరించుకొని ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహలను నిమ్మజ్జన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పిఠాపురం, కొండెవరం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహలను ట్రాక్టర్లపై ఊరేగించుకొంటూ ఉప్పాడ రేవునకు తీసుకొచ్చి నిమ్మజ్జం చేశారు. సముద్రంలో నిర్వహించే నిమ్మజ్జన వేడుకల్లో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు.

యువ గణపతికి ఉండ్రాళ్లతో పూజలు

గొల్లప్రోలు రూరల్(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణాదేవి ముఖద్వారం వద్ద నిలిపిన యువగణపతికి రెండువేల ఉండ్రాళ్లతో సోమవారం పూజలు నిర్వహించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలోనూ, పట్టణంలోనూ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో గత అయిదు రోజులుగా విశేష పూజలందుకున్న గణ పతి విగ్రహాలు సోమవారం నిర్వాహక కమిటీల ఆధ్వర్యంలో భక్తిగేయాలు ఆలాపించుకుంటూ పవిత్ర గోదావరి పుష్కరిణిలవద్దకు చేర్చి గోదావరి పుష్కరిణిలో నిమజ్జనం చేశారు.

ఆదినారాయణ మృతి తీరని లోటు: ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్లారినెట్ విద్వాంసుడు పెనుమర్తి ఆదినారాయణ మృతి కళారంగానికి తీరని లోటని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఆదినారాయణ సంతాపసభ కార్యక్రమానికి ఆయన సోమవారం హాజరయ్యారు. ముందుగా ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత ఆదినారాయణకు దక్కుతుందన్నారు. సూరిబాబురాజు, దారపురెడ్డి క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు సుందరపల్లి గోపాలకృష్ణ, సింహాచలం పాల్గొన్నారు.

'భక్తుల మనోభావాలను గౌరవించాలి'

కరప, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అనేక దేవాలయాల్లో ధర్మం కన్నా దుర్మార్గం పెరిగిపో యిందని, ఆధ్యాత్మిక కేంద్రాలు కాస్త వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయని రాష్ట్రీయ హిందూచైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు ఆరోపించారు. కరపమండలం పెనుగుదురులో సోమవారం ఆయన మాట్లాడుతూ భక్తులు మనోభావాలు దెబ్బతినేలా దేవదాయశాఖ సిబ్బంది ప్రవర్తిస్తున్నారన్నారు. దేవాలయాల్లో జరుగుతున్న అడ్డగోలు చర్యలు, ఇబ్బందులను పేర్కొంటూ రాష్ట్ర సీఎం చంద్రబాబుకు ఒక లేఖ రాసినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు కాదా సత్యనారాయణ, ముమ్మిడి శ్యామ్‌సుందర్ రావు, పేకేటి లక్ష్మీకాంతం, పడాల తేజశ్రీ పాల్గొన్నారు.

గొర్రిపూడిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

కరప, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కరపమండలం గొర్రిపూడిలో రూ.15లక్షలతో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ కానూరి రమాదేవి శ్రీహరి, ఉపసర్పంచ్ చీకాల సుబ్బారావులు శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థికసంఘం నిధులతో మురుకోపొర, పీటీపుంత ఏరియాల్లో సీసీ రోడ్లు, ఎస్సీపేటలో డ్రైన్‌లు నిర్మించనున్నట్టు సర్పంచ్ తెలిపారు. అయితే ఎమ్మెల్యేకు మాటమాత్రం తెలపకుండా గ్రామంలో అభివృద్ధి పనులకు వైసీపీకి చెందిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు శంకుస్థాపన చేయడంపై స్థానిక కూటమి నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే విషయంలో ప్రోటోకాల్ పాటించకుండా, అధికారులు లేకుండా, సెలవురోజైన ఆదివారంనాడు హడావిడిగా శంకుస్థాపనలు పెట్టడాన్ని పలువురు కూటమి నాయకులు తప్పు పడుతున్నారు.

'కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్య కోసం తన యావదాస్తిని దానంచేసిన మల్లాడి సత్యలింగం నాయకర్ పేరును కాకినాడజిల్లాకు నామకరణం చేయాలని మత్స్యకార నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిసి విన్నవించుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే కొండబాబు స్పందిస్తూ నాయకర్ ఆశయాలతో నేడు అనేకమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

సామర్లకోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి అనే మహిళకు వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ సాయం పంపిణీలో భాగంగా సోమవారం బాధితురాలికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెక్‌ను అందజేశారు. అచ్చంపేటలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ సాయాన్ని అందజేశారు. సాయం అందజేతకు రూ.49,920లకు చెందిన చెక్ మంజూరు కావడంతో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చినరాజప్ప అందజేశారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి

శంఖవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహా నిమజ్జనాల్లో కమిటీ సభ్యులు సనాతన ధర్మాన్ని పాటించాలని గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య పేర్కొన్నారు. సోమవారం కత్తిపూడి బుచ్చిసీతయ్యమ్మ సత్రంలో స్థానిక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. సింగిలిదేవి సత్తిరాజు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



మోతుగూడెంలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఓలయ్య, కార్యకర్తలు

మోతుగూడెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వై. రామవరం బొడ్డగండి గ్రామ పంచాయతీలో దాదాపు 39 గ్రామాల పరిధిలో సుమారు 584 పింఛన్లు ఉండగా ఈ నెలలో కొత్తగా స్పౌజ్ లో 10 పెన్షన్లు మంజూరు అయినట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.రఘుబాబు తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లు స్థానిక ఎంపీటీసీ సభ్యులు కరకా వెంకటరమణ చేతుల మీదుగా ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ రమణ ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం మోతుగూడెంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి తదితరులతో పాటు వార్డు మెంబర్లు, టీడీపీ సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది శివప్రసాద్ రెడ్డి, ప్రవీణ్, సుబ్రహ్మణ్యం, రామమూర్తి, బేబీ, ఏఎన్ఎం సునీత, సింధూర, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేత

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం, దేవారం, పాముగండి, చొప్పకొండ, డీఎస్‌పాలెం, వి.రామన్నపాలెం తదితర గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను పంపిణీ చేశారు. కూటమి నాయకుల చేతుల మీదుగా పింఛన్ సొమ్ములు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నాయకులు లంక హరిశ్చంద్రుడు, కర్రిబండి విష్ణు, వీరవల్లి పోసుబాబు, పెనుమాకుల రత్నం తదితరులు పాల్గొన్నారు.

పడవలపై వెళ్లి..

వీఆర్‌పురం, (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై వరద నీరు ఉన్నా సోమవారం పెన్షన్ల పంపిణీ యధావిదిగా నిర్వహించారు. ఆయా గ్రామాలకు ఇంజన్ బోట్లపై వెళ్ళి పింఛన్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో వడ్డిగూడెం వీఆర్వో గంగాభవాని, డిజిటల్ అసిస్టెంట్ బాలరాజు, ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

ఎటపాక, (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు అన్నారు. సోమవారం తోటపల్లి, సీతాపురం, గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని నెల్లిపాక, ఎటపాక, గన్నవరం, కన్నాయిగూడెం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియాల వెంకటేశ్వరరావు, పూరేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

రంపచోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి వింజెల వివేకానందరెడ్డి అనుమానాస్పద మృతిపై మెజిస్టీరియల్ ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని వక్తలు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఐ.వి.రమణ, పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనసూయ, హ్యూమన్ రైట్స్ వాచ్ రాష్ట్ర చైర్మన్ బాలకు అక్కిస ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో ధర్నా నిర్వహించారు. విద్యార్థి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

ఇంకా...వరద ముంపులోనే

విఆర్‌పురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు బాధిత కుటుంబాలు నిత్యావసర సరకుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా వరద తగ్గకుండా నిలకడగా ఉండడంతో బాధిత గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కన్నాయిగూడెం, చింతరేవుపల్లి, తుష్టివారిగూడెం, ఏపీ గూడెం, రామవరం, శ్రీరామగిరి, చొక్కనపల్లి, వడ్డిగూడెం తదితర గ్రామాల ప్రజలకు రాకపోకలు లేకపోవడంతో మూడు రోజులుగా జలదిగ్బంధంలో కాలం గడుపుతున్నారు. వడ్డిగూడెం నుంచి విద్యార్థులు ఇంజన్‌బోట్ సహాయంతో మండల కేంద్రానికి పాఠశాలకు వస్తున్నారు. వడ్డిగూడెం వరద బాధితులను దాట వేసేందుకు ఏర్పాటు చేసిన బోట్ పాయింట్ దగ్గర గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏవీవీ రమణ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నియోజకవర్గానికి మరో కీలక పదవి

రంపచోడవరం, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వం మరో కీలక పదవిని కట్టబెట్టింది. తెలుగుదేశం నాయకురాలు గొర్లె సునీతను రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యురాలిగా నియమిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈమె మాజీ మంత్రి ప్రకాశరావు కుమార్తె. అనంతర కాలంలో స్వతంత్ర అభ్యర్థిగా రంపచోడవరం నియోజకవర్గం నుంచి రెండు దఫాలు పోటీ చేశారు. తర్వాత కాలంలో తెలుగుదేశం సభ్యత్వం తీసుకుని క్రియాశీలకంగా ఉన్నారు. పార్టీ మహిళా విభాగంలో రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నారు. ఈమె సేవలను ముందే గుర్తించిన పార్టీ ఆమెను తొలుత గిరిజన సహకార సంస్థ డైరెక్టరుగా నియమించారు. ఇప్పుడు ఆమెను ఎస్టీ కమీషన్‌కు సభ్యురాలిగా నియమించారు. ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా బీజేపీ నాయకుడు బొజ్జిరెడ్డిని నియమించిన ప్రభుత్వం సభ్యురాలిగా ఇదే నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకురాలికి కట్టబెట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. త్వరలో మరికొందరికి ఇక్కడి నుంచి అవకాశాన్ని కల్పించనున్నట్టు సమాచారం.

ప్రత్యేక జిల్లా చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానం

రాజవొమ్మంగి సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ప్రత్యేక జిల్లా చేయాలంటూ రాజవొమ్మంగి మండలంలోని లోదొడ్డి పంచాయతీలో సోమవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు లోదొడ్డి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రంపచోడవరం నియోజకవర్గం వేరు చేసి అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిపిన తరువాత మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 250-300 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నదని ఆయన అన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

రంపచోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంపచోడవరం జ్యుడిషియల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.మురళి గంగాధర్ రావు అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి 30 వరకు నిర్వహించే బాల్య వివాహాలపై అవగాహనలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.ఆర్.ఆర్.భగవాన్, చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి కె.ఉమా, గైనకాలజిస్ట్ డాక్టర్ మోమీనా షాజద్, ప్రధానోపాధ్యాయుడు ఆర్.ఎల్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు ఎస్.పద్మావతి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

రాజవొమ్మంగి సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలోని ఎరువుల షాపులను సోమవారం తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా ఎరువుల షాపుల్లోని స్టాక్‌ను, వాటి రిజిష్టర్లను పరిశీలించారు. రైతులకు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని , ప్రభుత్వ నిబంధనలు పాటించని ఎరువుల షాపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి చక్రధర్ తదితరులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తుని ఎమ్మెల్యే దివ్య

స్మార్ట్‌కార్డుల పంపిణీ





తుని మండలం తాళ్లూరులో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య, జగ్గంపేట మండలం రామవరంలో మహిళకు స్మార్ట్ కార్డ్ అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

తునిరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు. తాళ్ళూరులో తహశీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన స్మార్ట్‌కార్డుల పంపిణీకి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పథకాల్లో పారదర్శకత చూపిస్తూ ప్రభుత్వం స్మార్ట్‌కార్డులను రూపకల్పన చేయడం జరిగిందన్నారు. తాళ్లూరు గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముస్లిం పెద్దల అభ్యర్థన మేరకు కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, ఆవుగడ్డి వెంకటరమణ, తమరాన వరలక్ష్మి, కృష్ణ, సత్యనారాయణ, షేక్ రబ్బాని, షేక్ హుస్సేన్ ఉన్నారు.

రామవరంలో..

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరంలో స్మార్ట్‌కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకే ఈ స్మార్ట్‌కార్డులు వ్యవస్థను తీసుకు వస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రేషన్ బండి ఒకసారి వచ్చి పోయేదని, ఇంటి వద్ద లేకపోతే రేషన్ అందేది కాదని ఇప్పుడు మనకి ఎప్పుడు తీసుకోవాలంటే అప్పుడు డైరెక్టుగా రేషన్ షాప్ దగ్గరికి వెళ్లి తీసుకునే విధంగా ప్రభుత్వం సదుపాయం కల్పించిందని వివరించారు. ఇప్పటివరకు ఉన్న రేషన్ కార్డులో కుటుంబ సభ్యులందరి ఫోటోలు ఉండేవని ఇప్పుడు కుటుంబ యజమాని ఫొటో మాత్రమే ఈ స్మార్ట్ కార్డులో ఉంటుందని వివరించారు. ఏటీఎం కార్డు తరహాలోనే ఈ స్మార్ట్‌కార్డు రూపొందించడం జరిగిందని వివరించారు. స్వైపింగ్ మిషన్లో ఏటీఎం కార్డును స్వైప్ చేస్తే వివరాలు వస్తాయని వివరించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, జీనుమణి బాబు, అడబాల వెంకటేశ్వరరావు, పోతుల మోహనరావు, బుర్రి సత్తిబాబు, బసవ చిన్నబాబు, అడపా తాతాజీ పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమరాయణంపేటలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని ఎమ్మెల్యే నెహ్రూ ప్రారంభించారు. నాయకులు అడపా భరత్, బస్వా వీరబాబు, వీరంరెడ్డి కాశీబాబు, తోట రవి, తోట గాంధీ, పోతుల మోహనరావు, నీలం శ్రీను, తహశీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ, పాటంశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

'పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన చంద్రబాబు'

జగ్గంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత మూడున్నర దశాబ్దాలుగా నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమ వారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. నెహ్రూ మాట్లాడుతూ నేడు రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి. 30 ఏళ్ల క్రితం 1995 సెప్టెంబర్ 1న చంద్రబాబు తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. మరొక 30 ఏళ్ల రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేయాలని నెహ్రూ ఆకాంక్షించారు.

7న జాబ్‌మేళా

తునిరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో ఈనెల 7న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగ పరుచుకోవాలని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు. తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించారు. గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, ఒక్కడుపు బాలాజీ, మల్ల గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

కొమ్ములకు అభినందన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు టీడీపీ నేత కొమ్ముల తిరుపతి కుమార్ (కన్నబాబు)కు ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ బోర్డు పదవి ప్రభుత్వం కల్పించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అడపా జగదీష్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు కన్నబాబుకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. వెలుగు ఏపీఎం జి.శ్రీనివాసరావు, సీసీలు వెంకట్‌తో పాటు మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు సన్మానించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

గండేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గండేపల్లి గ్రామ శివారున జాతీయ రహదారిపై సోమవారం ఆగిపోయింది. మరమ్మతుల కారణంగా బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే సత్యప్రభ



శరభవరంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో లో ఓల్టేజ్‌తో పాటు ఇతర విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే సత్యప్రభ చెప్పారు. శరభవరంలో లో ఓల్టేజ్ సమస్య నివారణ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రత్తిపాడు మండలంలోని శాంతి ఆశ్రమం పరిధిలో 12 గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరాది వెంకట్రావు, ప్రత్తిపాడు ఏడీఏ రాజశేఖర్, ఏఈ శ్రీనివాస్, ఎల్ఐలు వెంకటరమణ, సతీష్, కార్యదర్శి నాగార్జున, కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, పల్లా గోపి, సుంకర సోమరాజు, పోల్నాటి భగవాన్, సత్యంశెట్టి సీతారాం, కురందాస్ అప్పలరాజు, దాకారపు కృష్ణ, జింకల తాతారావు పాల్గొన్నారు.

'ఉత్తమ సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు'

అన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగి విధి నిర్వహణలో ఉత్తమసేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. అన్నవరం దేవస్థానం హైస్కూల్ హెచ్ఎం అల్లాడ వెంకటేశ్వరరావు పదవీవిరమణ సందర్భంగా వీడ్కోలు సభకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, సహచర ఉపాధ్యాయులు పర్వత విరేష్, అనకాపల్లి బుచ్చిబాబు, స్థానిక టీడీపీ నాయకులు వీర్ల సూరిబాబు, పర్వత సురేష్, బొమ్మిడి సత్తిబాబు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వార్షికోత్సవ వేడుకలు



పేదలకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం గత నాలుగేళ్లుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సహకారంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు టీడీపీ యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి పేదలకు అన్నదానం నిర్వహించారు. నాగేంద్రచౌదరిని సత్కరించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు,కందుల చిట్టిబాబు పాల్గొన్నారు.

పింఛను పంపిణీకి వెళితే అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఫిర్యాదు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పింఛను పంపిణీకి వెళితే అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ వృద్ధుడిపై మహిళా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సచివాలయం 3లో మహిళా పోలీస్‌గా విధుల్లో చేరిన తుర్గం రాధిక సోమవారం ధర్మవరం సచివాలయం3 పరిధిలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. దొండుకూరి జగన్నాధ రాజుకు పింఛను పంపిణీ కోసం ముదునూరి రామరాజు ఇంటికి వెళ్లగా ఆ క్రమంలో తన పట్ల ముదునూరి రామరాజు అసభ్యకరంగా మాట్లాడారని తుర్గం రాధిక ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, ఎస్ఐ లక్ష్మీకాంతంలకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో కుమార్‌బాబు రాధిక ఫిర్యాదును జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌ల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఎస్ఐ లక్ష్మీకాంతం సోమవారం రాత్రి విచారణ చేపట్టారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. తుని నియోజకవర్గం కోటనందూరు మండలం నుంచి టీడీపీ సీనియర్ నాయకులు వెలగా వెంకటకృష్ణారావు, వెలగా వెంకట రంగనాయకులు ఆధ్వర్యంలో 200 మందికి పైబడి వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. వారికి యనమల పార్టీ కండువాలు కప్పగా తుని ఎమ్మెల్యే యనమల దివ్య పార్టీలోకి ఆహ్వానించారు. సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. టీడీపీ నాయకులు చింతంనీడి అబ్బాయి, గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, దంతులూరి చిరంజీవరాజు తదితరులున్నారు.

ప్రత్తిపాడులో నేత్రదాన ర్యాలీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి వద్ద సోమవారం నేత్రదాన ర్యాలీని ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ బి.సౌమ్య షైబేల్ ప్రారంభించారు. వయస్సుతో సంబంధం లేకుం డా బీసీ,షుగర్ ఉన్న వాళ్ళు కూడా నేత్రదానం చేయవచ్చని, నల్లగుడ్డు సమస్యలతో బాధపడే వారికి నేత్రదానం ద్వారా చూపును అందించవచ్చని తెలిపారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఎమ్మెల్యే ప్రారంభించారు. కూటమి నాయకులు అమరాది వెంకట్రావు, కన్నబాబు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, కార్యదర్శి నాగార్జున, జనసేన నాయకుడు కత్తిపూడి బాబి, పల్లా గోపి,ఎస్.సీతారాం ఉన్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): కాకరాపల్లి గ్రామంలో పింఛన్లను ఎమ్మెల్యే యనయల దివ్య పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, గాడి రాజుబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డిరమేష్, సామినీడి కృష్ణార్జునరావు, డి.చిరీంజీవిరాజు, మాతిరెడ్డిభాస్కర్‌రావు, షేక్‌నవాబ్‌జానీ, వాసం నాగేశ్వరరావు, ఎల్. సత్యనారాయణమూర్తి ఉన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి గ్రామంలో దివ్యాంగులకు మంజూరైన పింఛన్లను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, యర్రంశెట్టి బాబ్జి, సుంకవిల్లి రాజు, కంటిపూడి సత్యనారాయణ, శీలామంతుల వీరబాబు, తెలగారెడ్డి భద్రరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంకన్నచౌదరి ఉన్నారు.

తునిరూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 18వ వార్డులో పింఛన్లను తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్లభువన సుందరి కౌన్సిలర్‌తో కలిసి పంపిణీ చేపట్టారు. అధికారులను తొలిరోజే నూరు శాతం పంపిణీ జరిగేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు.